సమస్యలు పరిష్కరించాలని వినతి

నరసాపురం : పురపాలక సంఘంలో ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న టెక్నికల్, నాన్ టెక్నికల్ సిబ్బంది శనివారం ఆందోళన బాట పట్టారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. అనంతరం కమిషనర్ అంజయ్యకు సమ్మె నోటీస్ ఇచ్చారు. నాన్ టెక్నికల్ సిబ్బందికి రూ.24,500, టెక్నికల్ సిబ్బందికి రూ.28 వేలు జీతం ఇవ్వాలని కోరారు. అనంతరం ఛైర్పర్సన్ బర్రె శ్రీ వెంకటరమణకు, విప్, ఎంఎల్ఎ నాయకర్లకు వినతిపత్రాలందించారు. ఈ కార్యక్రమంలో వల్లభనేని ఫణి, తామస్, నరేంద్ర, బ్రహ్మాజీ, రత్నం, వెంకటకృష్ణ, దుర్గారావు, కుమార్, సుజాత, శ్రీను పాల్గొన్నారు.

వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగులు

ఊరించి.. ఉసూరుమన్పించి..!

అర్ధాంతరంగా నిలిచిన కార్పొరేషను రుణాల ప్రక్రియ

బిసి, కాపు కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు ప్రక్రియ పూర్తి

25 వేల వరకూ దరఖాస్తులు..

లబ్ధిదారుల ఎంపిక నిలిపివేత

రెండు జిల్లాల్లో 5 వేల యూనిట్లకు బ్రేక్

దరఖాస్తు దశలోనే ఎస్సి కార్పొరేషన్ రుణ ప్రక్రియ నిలిపివేత

ఇప్పట్లో రుణాలిస్తారా.. లేదా అని జనాల్లో చర్చ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

బిసి, కాపు, ఎస్సి ఇతర కార్పొరేషన్ రుణాలను ప్రభుత్వం అర్ధాంతరంగా నిలిపివేయడంపై జనాల్లో తీవ్ర చర్చ సాగుతోంది. నోటిఫికేషన్ విడుదల చేసి దరఖాస్తులు స్వీకరించాక ఎందుకు నిలుపుదల చేసిందో ప్రభుత్వం నుంచి సరైన సమాధానం లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే వైసిపి ప్రభుత్వం నిలిపివేసిన కార్పొరేషన్ రుణాలను పునఃప్రారంభించామని గొప్పలు చెప్పిన పరిస్థితి ఉంది. ఇప్పుడు వైసిపి బాటలోనే నడుస్తుండటంతో విమర్శలు విన్పిస్తున్నాయి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో బిసి కార్పొరేషన్ కింద 3,600 యూనిట్లు, కాపు కార్పొరేషన్ కింద 1,387, ఇడబ్ల్యుఎస్ కోటా కింద 215 యూనిట్లు మంజూరయ్యాయి. మార్చి పదో తేదీ నుంచి అదే నెల 22 వతేదీ వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ సైతం జరిగింది. దాదాపు 25 వేలకుపైగా దరఖాస్తులు వచ్చినట్లు చెబుతున్నారు. మండల పరిషత్ కార్యాలయాల్లో ఇంటర్వ్యూలు నిర్వహించి, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరపాల్సి ఉండగా అర్ధాంతరంగా నిలిపివేశారు. ఎస్సి కార్పొరేషన్‌కు సంబంధించి మే పదో తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. దరఖాస్తుల స్వీకరణ ముమ్మరంగా జరుగుతుండగా ఆన్‌లైన్ ప్రక్రియ ఆపేశారు. అదేమని అడిగితే ప్రభుత్వ నిర్ణయమని చెప్పారు. దీంతో బిసి, కాపు, ఎస్సి సామాజిక తరగతులతోపాటు కార్పొరేషన్ రుణాలు పొందాల్సిన ఇతర సామాజిక తరగతుల ప్రజానీకంలోనూ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. కార్పొరేషన్ రుణాల ప్రక్రియ ఎందుకు ఆపేశారో అధికారులుగాని, ప్రభుత్వంగాని సరైన సమాధానం ఇవ్వని పరిస్థితి ఉంది.

రుణాల కోసం ఎదురుచూపులు

కార్పొరేషన్ రుణాలకు సంబంధించి ప్రభుత్వం ప్రత్యేక నిబంధనలు సైతం విడుదల చేసింది. రూ.లక్ష నుంచి రూ.పది లక్షల వరకూ యూనిట్లు ఏర్పాటుకు సంబంధించి రుణాల మంజూరు ప్రక్రియ ఉంది. జనరిక్ మెడికల్ స్టోర్లు సైతం ఈసారి కార్పొరేషన్ రుణాల్లో పెట్టారు. కార్పొరేషన్ రుణం వస్తే 50 శాతం సబ్సిడీ వర్తిస్తోంది. రూ.ఐదు లక్షల రుణం తీసుకుంటే రూ.రెండున్నర లక్షలు సబ్సిడీ రానుంది. లబ్ధిదారులు బ్యాంకుకు రూ.రెండున్నర లక్షలు చెల్లిస్తే సరిపోతుంది. 2014-19 మధ్య ఎస్సి కార్పొరేషన్ రుణాల్లో భాగంగా టిడిపి ప్రభుత్వం ఇన్నోవా వంటి కారులు సైతం ఇచ్చింది. కారులు పొందిన లబ్ధిదారులకు ఉపాధి దొరకడంతోపాటు ఆర్థికంగా నిలదొక్కుకున్న పరిస్థితి ఉంది. పాడి పశువులను సైతం కొనుగోలు చేసుకుని జీవనం పొందారు. కొంతమంది కిరాణా దుకాణాలు వంటివి ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందారు. 2019లో అధికారంలోకొచ్చిన వైసిపి ప్రభుత్వం కార్పొరేషన్ రుణాలను నిలిపివేయడంతో జనాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఆ ప్రభావం 2024లో ఎన్నికల్లో స్పష్టంగా కనిపించింది. గత ఎన్నికల్లో తాము అధికారంలోకి వచ్చాక కార్పొరేషన్ రుణాలను పునరుద్ధరిస్తామని కూటమి నాయకులు చెప్పారు. హామీ ఇచ్చినట్లుగానే కార్పొరేషన్ రుణాలను ప్రారంభించిన ప్రభుత్వం కారణం చెప్పకుండా ఆపేసింది. కార్పొరేషన్ రుణం వస్తే ఉపాధి మార్గం దొరుకుతుందని లబ్ధిదారులు కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం నుంచి సరైన స్పందన లేకుండాపోయింది. ప్రభుత్వం వెంటనే కార్పొరేషన్ రుణాల ప్రక్రియను ప్రారంభించి లబ్ధిదారుల ఎంపిక పూర్తిచేసి రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

అందుకే ముందస్తుగానే పెన్షన్ల పంపిణీ : మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పోడూరు

ప్రజాసంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని, అందువల్లే ఒకరోజు ముందుగానే పెన్షన్ పంపిణీ చేస్తున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. మండలంలోని జిన్నూరులో శనివారం ఆయన వృద్ధునికి పింఛన్ అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఒకటో తేదీ ఆదివారం సెలవు రోజు కావడంతో ముందుగానే పెన్షన్ సొమ్ము పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

పోడూరులో....

తాడేపల్లిగూడెం: ప్రశాంత వాతావరణంలో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ పంపిణీ చేసినట్లు జిల్లా ప్రత్యేక అధికారి ఎ.సూర్యకుమారి తెలిపారు. శనివారం పట్టణంలోని మిలటరీ కాలనీ, రూరల్ మండలం వెంకటరామన్నగూడెంలో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, రాష్ట్ర విప్, తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్‌తో కలిసి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో 2,23,675 మంది లబ్ధిదారులకు రూ.96.73 కోట్లను 4,600 మంది సిబ్బందితో శనివారం ఉదయం ఏడు గంటల నుండి పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. 2023 డిసెంబర్ ఒకటో తేదీ నుంచి 2024 అక్టోబర్ 31 మధ్యకాలంలో పెన్షన్ తీసుకుంటూ చనిపోయిన భర్త పెన్షన్‌ను భార్యకు ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లాలో సుమారు మూడు వేల మందికి ఈ నెల 12వ తేదీన పెన్షన్ బకాయిలను అందజేస్తారని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ఇచ్చిన హామీల్లో భాగంగా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నారు. అనంతరం తాడేపల్లిగూడెం మెయిన్ కెనాల్‌లో పూడికతీత పనులను వారు పరిశీలించారు. తొలుత తాడేపల్లిగూడెం పట్టణంలోని మిలటరీ కాలనీలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి జిల్లా ప్రత్యేక అధికారి, కలెక్టర్, ఎంఎల్‌ఎ పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ ఖతీబ్ కౌసర్‌భానో, డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్.వేణుగోపాల్, ఐసిడిఎస్ పీడీ బి.సుజాతరాణి, కమిషనర్ ఎం.ఏసుబాబు, ఎడిఎ పి.మురళీకృష్ణ, తహశీల్దార్ ఎం.సునీల్‌కుమార్, పెంటపాడు తహశీల్దార్ సీతారత్నం, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో....

ఉగ్రవాదం, మతోన్మాదాలను ఐక్యంగా ఎదుర్కోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఉగ్రవాదాన్ని సమైక్యంగా ఎదుర్కోవాల్సిన సమయంలో కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మతోన్మాదాన్ని రెచ్చగొట్టి మైనార్టీలపై వ్యతిరేకతను నూరిపోస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు అన్నారు. శనివారం సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సమైక్యతా యాత్ర స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనం నుండి పోలీస్ ఐల్యాండ్ వరకు నిర్వహించారు. ఉగ్రవాదం, మతోన్మాదం, యుద్ధోన్మాదం నశించాలని, మత సామరస్యాన్ని కాపాడాలని పెద్దఎత్తున నినదించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ పెహల్గాం ఉగ్రదాడి సమయంలో మతాలకు అతీతంగా అంతా కలిసికట్టుగా బాధితులకు సాయం చేశారని, అటువంటి వారికి అభినందనలు తెలపాల్సిన ప్రధాని తీవ్ర వ్యతిరేకతను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. ఉగ్రవాద శిబిరాలపై దాడి చేసిన సోఫియా ఖురేషియాని ఉగ్రవాదుల సోదరిగా బిజెపి నాయకులు వర్ణించడం అత్యంత సిగ్గుచేటన్నారు. బిజెపికి మద్దతిస్తున్న జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ముస్లిములు పాకిస్తాన్ వెళ్లిపోవాలంటూ ముస్లిం వ్యతిరేకతను మరింత రెచ్చగొడుతున్నారని విమర్శించారు. మత సామరస్యాన్ని కాపాడుకునేందుకు ప్రతిఒక్కరూ పాటుపడాలన్నారు. సిపిఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ పేరుతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమానికి అందరూ సంఘీభావం తెలిపినప్పటికీ కేంద్ర ప్రభుత్వం కొనసాగించలేకపోయిందన్నారు. అమెరికా జోక్యంతో ఆపివేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో నేతలు జవ్వాది శ్రీను, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, నరమాల కృష్ణ, రాజాన గోవిందు, దాసరి రాజు, పతివాడ నాగేంద్రబాబు, నీరుకొండ లక్ష్మీనారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

నినదిస్తున్న నేతలు

1153 రకం ధాన్యం కొనుగోలు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు

ప్రజాశక్తి - నరసాపురం

1153 రకం ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు డిమాండ్ చేశారు. శనివారం పసలదీవి గ్రామంలో కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. స్థానిక రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు రైతులు 1153 రకం ఊడ్చారన్నారు. అయితే పంట చేతికి వచ్చిన తర్వాత ఈ రకం ధాన్యాన్ని అమ్ముకోవడానికి రైతులు నానావస్థలు పడాల్సి వస్తుందన్నారు. మండలంలో ఈ రకం ధాన్యం సుమారు 1500 టన్నులు వరకు ఉంటుందన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని వ్యవసాయ, రెవెన్యూ శాఖల ద్వారా మిగిలిపోయిన ధాన్యాన్ని రైతుల నుండి కొనుగోలు చేయడానికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయ సిబ్బంది ద్వారా వివరాలు సేకరించి రైతు నుంచి ప్రతి గింజ కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పెద్దిరాజు తెలిపారు. లేనిపక్షంలో రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి జల్లి రామ్మోహనరావు, స్థానిక రైతులు గన్నాబత్తుల లక్ష్మణస్వామి, యాళ్ల ఏసుబాబు, యాళ్ల నాగ సత్యనారాయణ, కొట్టు సుబ్బారావు, పోలిశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

అభివృద్ధి పనుల్లో జాప్యం సహించను

మంత్రి రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలో కోట్లాది రూపాయలతో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పనుల్లో జాప్యం జరిగితే సహించేది లేదని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు హెచ్చరించారు. పట్టణంలో శనివారం పలు అభివృద్ధి పనులను కూటమి నాయకులు, సంబంధిత అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా టిడ్కో గృహాల కాలనీ ప్రాంతంలో అధికారులతో పనులపై సమీక్ష నిర్వహించారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో గత ప్రభుత్వ ఐదేళ్ల విధ్వంసం నుంచి అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తున్నామన్నారు. ప్రధానంగా గత టిడిపి ప్రభుత్వంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను జగన్ ఐదేళ్ల పాలనలో పూర్తిగా గాలికొదిలేశారన్నారు. టిడ్కో ఇళ్లలో 50 శాతం జూన్ నెలాఖరు నాటికి పూర్తి కావాలని లక్ష్యంగా పెట్టుకున్నా పనుల్లో జాప్యం జరుగుతుందని, దీనిపై సంబంధిత అధికారులు, ఏజెన్సీలకు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. టిడ్కో ఇళ్లతోపాటు మిగిలిన అభివృద్ధి పనులు పూర్తి చేసి అభివృద్ధిలో పాలకొల్లును ఆదర్శంగా నిలుపుతానని మంత్రి తెలిపారు. హిందూ శ్మశాన వాటిక, అబ్దుల్ కలాం, రామగుండం ఉద్యానవనాలు, బొండాడ వెంకటరాజు గుప్తా, ఎన్‌టిఆర్ కళాక్షేత్రం, పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రి నూతన భవనం, నరసాపురం ప్రధాన కాలువపై కాలిబాట వంతెన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, మున్సిపల్ కమిషనర్ విజయసారథి, వివిధ శాఖల డిఇలు, ఎఇలు, నాయకులు గండేటి వెంకటేశ్వరరావు, పెచ్చెట్టి బాబు, కర్నేన గౌరునాయుడు, కోడి విజయభాస్కర్, తులా రామలింగేశ్వరరావు, విన్నకోట గోపీ, పినిశెట్టి శ్రీనివాస్, ఉన్నమట్ల కబర్ధి, జక్కంపూడి కుమార్ పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల పనులను పరిశీలిస్తున్న మంత్రి

ఆక్వా క్రాప్‌హాలిడే వాయిదా

ప్రజాశక్తి - పాలకొల్లు అర్బన్

ఆక్వా క్రాప్ హాలిడే, చలో అమరావతి కార్యక్రమాలను వాయిదా వేసినట్లు జై భారత్ క్షీరారామ ఆక్వా రైతుసంఘం అధ్యక్షులు గాంధీభగవాన్ రాజు తెలిపారు. శనివారం ఆయన పాలకొల్లు మండలం చందపర్రు ట్రిపుల్ ఎస్ కళ్యాణ మండపంలో జరిగిన సంఘ సమావేశంలో మాట్లాడారు. వచ్చే ఏప్రిల్, మే నెలల్లో పంట సాగు విరామానికి అనుకూలంగా ఉందని రైతులు సూచించారని తెలిపారు. దీనికితోడు మంత్రి నిమ్మల రామానాయుడు సూచన మేరకు క్రాప్‌హాలిడే, చలో అమరావతి కార్యక్రమాలను వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బోనం చినబాబు, వెంకట రంగయ్యానాయుడు, మేకా ఫణీంద్ర ప్రసాద్, మేడిది జాన్ డేవిడ్ రాజు, అంగర వరప్రసాద్, భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ, పెన్మెత్స సత్యనారాయణరాజు, చంటి రాజు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం

అరుంధతి పేటలో పర్యటించిన ఆర్‌బ్ల్యూఎస్ అధికారులు

సిపిఎం ఆధ్వర్యాన మహిళల ధర్నాకు స్పందన

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని చించినాడ గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక మహిళలు శుక్రవారం పంచాయితీ కార్యాలయం వద్ద చేసిన ధర్నా కార్యక్రమానికి ఆర్‌డబ్ల్యూఎస్ మండల అధికార యంత్రాంగం కదిలింది. శనివారం ఉదయం తాగునీటికి తీవ్ర ఎద్దడిని ఎదుర్కొంటున్న అరుంధతి పేటలో ఆర్‌బ్ల్యూఎస్ మండల స్థాయి అధికారులు పర్యటించి స్థానికుల నుంచి తాగునీటి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక వార్డు మెంబర్ తెన్నేటి స్టాలిన్ అధికారులతో మాట్లాడుతూ గత రెండు, మూడు సంవత్సరాలుగా అరుంధతిపేట ఏరియాతోపాటు గ్రామంలోని మరికొన్ని ప్రాంతాలలో తీవ్ర తాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నామని, ఈ సమస్యను పరిష్కరించాలని పంచాయతీ పాలకవర్గానికి బోర్డు మీటింగ్ జరిగిన ప్రతి సందర్భంలోనూ ఎన్ని సార్లు విన్నవించినా.. పట్టించుకోలేదు. దీంతో సమస్య తీవ్ర రూపం దాల్చిందని, ఇప్పటికైనా అధికారులు ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ జెఇ వి.వి.రమణ మాట్లాడుతూ ప్రస్తుతానికి అరుంధతిపేట ఏరియాకు కుళాయి ద్వారా నీరు సరఫరా చేసే సమయంలో గ్రామంలో ఇతర ప్రాంతాలకు వెళ్లే వాల్స్‌ను బంద్ చేసి నీళ్ల అందేవిధంగా చర్యలు తీసుకుంటామని, అతి త్వరలోనే అరుంధతి పేటకు తాగునీటి సమస్య లేకుండా శాశ్వత పరిష్కార మార్గం చూపిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట గ్రామ సర్పంచి దంగేటి రాజమణి, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది కాంతారావు, పంచాయతీ కార్యదర్శి మాదాసు హరిప్రసాద్, పంచాయతీ సిబ్బంది పంతకాని సత్యనారాయణ, తాడి ఏడుకొండలు, స్థానిక నాయకులు మొమ్మిడివరపు ఆంజనేయులు, ముస్కాడి జయశ్రీ, ముస్కాడి విజయకుమార్, ఎస్.మరియమ్మ పాల్గొన్నారు.

స్థానికులతో మాట్లాడుతున్న ఆర్‌బ్ల్యూఎస్ మండల అధికారులు

రీసర్వే పేరుతో బెదిరింపు తగదు

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - ఆకివీడు

మండలంలోని తాళ్లకోడు జగనన్న కాలనీలో రీ ఎంక్వయిరీ పేరుతో జరుగుతున్న బెదిరింపు చర్యలను తక్షణమే ఆపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆకివీడు ఏరియా కమిటీ సమావేశం పార్టీ నాయకులు పెంకి అప్పారావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న గోపాలన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా విచిత్రంగా రాజకీయ ప్రభావాలకు గురై జిల్లా కలెక్టర్ తాళ్లకోడు జగనన్న కాలనీలో అనర్హుల గుర్తింపు పేరుతో రీ ఎంక్వయిరీ చేయడం తగదని అన్నారు. అర్హులైన లబ్ధిదారుల కోసం 2007లో కొనుగోలు చేసిన 74 ఎకరాల తాళ్లకోడు కాలనీలో 2673 మంది ఆకివీడు గ్రామ పంచాయతీకి చెందిన వారిని గుర్తించారని, వారికి 2019 వరకు స్థలాలను స్వాధీన పరచకుండా కాలయాపన చేశారని అన్నారు. 2019 నుంచి ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో గృహ నిర్మాణాలు చేపట్టకపోతే స్థలాలను వెనక్కు తీసుకుంటామని బెదిరించి ఎటువంటి మౌలిక సదుపాయాలు కల్పించకుండా నిర్బంధంగా నిర్మాణాలు చేయిస్తున్నారన్నారు. 10 నుంచి 15 లక్షల రూపాయల వరకు అప్పులు చేసి గృహ నిర్మాణాలు చేసుకున్న వారినీ రీ ఎంక్వయిరీల పేరుతో భయభ్రాంతులకు గురి చేయడం పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం ప్రదర్శించడమేనన్నారు. చిత్తశుద్ధి ఉంటే మండలంలో వేలాది ఎకరాల ప్రభుత్వ అసైన్డ్ భూములను ఆక్రమించుకుని ఏళ్ల తరబడి అనుభవిస్తున్న భూ కబ్జాదారుల నుంచి కాపాడాలన్నారు. వాటిని రీ ఎంక్వయిరీ చేసి వెనక్కు తీసుకోవాలని హితవు పలికారు. వాస్తవాలను పక్కన పెట్టి కొంతమంది కక్ష సాధింపు చర్యల్లో భాగంగా అధికార యంత్రాంగం కూడా భాగస్వామ్యమై పేద ప్రజలను వేధిస్తే చూస్తూ ఊరుకోమని, జిల్లా వ్యాప్త ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ ఏరియా కార్యదర్శి కె.తవిటి నాయుడు మాట్లాడారు. కమిటీ సభ్యులు డోకల లక్ష్మి, ఎస్.ఉదయ్ కుమారి, బి.కళ్యాణి, డి.రవితేజ, బి.రాంబాబు, బివి.వర్మ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

ప్రయివేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దందా అరికట్టాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి.ప్రతాప్

తణుకు : కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థల్లో భారీగా ఫీజులు వసూలు చేస్తున్న వారిపై కూటమి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి.ప్రతాప్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన ధర్నా జరిగింది. అనంతరం తహశీల్దార్ కార్యాలయ ఇన్‌ఛార్జి నారాయణకి డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్పొరేట్ ఫీజులపై సిపిఎం వేసిన కరపత్రాలు ఆవిష్కరించి పంపిణీ చేశారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని, విద్యా వ్యాపారం ఆపాలని, విద్యాహక్కు చట్టాన్ని చిత్తశుద్ధితో అమలు చేయాలని, నాణ్యమైన విద్య అందరికీ అందించాలని, ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించిన విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ రాజ్యాంగంలో విద్యని వ్యాపారం చేయడం చట్ట విరుద్ధమన్నారు. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక పథకం ప్రకారం పేదలకు విద్య అందనంత దూరం తీసుకొని వెళ్లారని విమర్శించారు. ఫీజులు పెరుగుతున్నంతగా ప్రజల ఆదాయాలు మాత్రం పెరగడం లేదనేది అక్షర సత్యం అన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న వారిపై అధికారులు చర్యలు చేపట్టాలని, లేకుంటే సిపిఎం ఆందోళన చేపడుతుందని ప్రతాప్ హెచ్చరించారు.

నిరసన తెలుపుతున్న సిపిఎం నేతలు

కాలువ పూడికతీత పనులు ప్రారంభం

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం పశ్చిమ కాలువ పూడికతీత పనులను శనివారం పెర్కిపాలెం గ్రామం వద్ద ప్రారంభించారు. ఎంపిపి వీరవల్లి దుర్గాభవాణి, జెడ్‌పిటిసి గుండా జయప్రకాష్ నాయుడు, డిసి ఛైర్మన్ ఆకుల లీలాకృష్ణలు ముఖ్య అతిథిలుగా విచ్చేసి పనులు ప్రారంభించారు. పెర్కిపాలెం నుంచి 5.800 నుంచి మెంటేపూడి మూడో నెంబర్ డ్యాం 10.100 వరకు ఎస్‌డిఎంఎఫ్ నిధులు రూ.6.89 లక్షలతో కాలువ పూడిక పనులు పూర్తి చేయనున్నట్టు ఇరిగేషన్ ఎఇ సత్యనారాయణ తెలిపారు. ఈ పూడికతీత పనులతో కాలువ శివారు ఆయకట్టు గ్రామాలైన మత్స్యపురి, బొబ్బనపల్లి, మేంటేపూడి, బాలేపల్లి గ్రామాలకు సక్రమంగా సాగునీరు అందే అవకాశం ఉంది. పూడికతీత పనులు చేపట్టడం పట్ల ఆయా ప్రాంతాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు వీరవల్లి చంద్రశేఖర్, గవిరెడ్డి శ్రీనివాసరావు, వేండ్ర దివాకర్, వీరవల్లి శ్రీనివాసరావు, రెడ్డి చినసన్యాసిరావు, రైతులు పాల్గొన్నారు.

సమస్యలకు నిలయంగా కాటన్ పార్క్

మున్సిపల్ కమిషనర్‌కు సిపిఎం ఆధ్వర్యాన వినతి

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలో సర్దార్ కాటన్ పార్క్ సమస్యలకు నిలయంగా మారిందని సిపిఎం పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు ఆవేదన వ్యక్తంచేశారు. స్థానిక మున్సిపల్ కమిషనర్ అంజయ్యకు సిపిఎం బృందం సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా త్రిమూర్తులు మాట్లాడుతూ కాటన్ పార్క్ సమస్యలకు నిలయంగా మారిందన్నారు. ఈ పార్కులో చిన్న పిల్లలు ఆడుకునే జారుడుబల్లలు, బెంచీలు, ఉయ్యాలలు, వివిధ ఆట వస్తువులు శిథిల వ్యవస్థకు చేరుకున్నాయన్నారు. పిల్లలు జారె బల్లలు బెజ్జాలు ఏర్పడటం వల్ల ఆడుకునే సమయంలో వారు గాయాల పాలవుతున్నారన్నారు. ఉయ్యాల ఒరిగిపోయి పిల్లలు ఆడుకోవటానికి అసౌకర్యంగా, ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. పిల్లలు ఆడుకునే ఆట వస్తువులు పాడైపోయి నిరుపయోగంగా పడి ఉన్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం ఏంటని ప్రశ్నించారు. పార్కులో వ్యాయామ పరికరాలు, నట్లు, స్ప్రింగులు ఊడిపోయి, కదిలిపోయి రిపేర్‌కు వచ్చినా వాటిని మరమ్మతులు చేయించకుండా సంబంధిత మున్సిపల్ అధికారులు చూసిచూడనట్టు వ్యవహరించడం తగదన్నారు. పార్క్‌లో గడ్డి చెట్లు పెరిగిపోయి విష సర్పాలు సంచరించడం వల్ల పార్కుకు వచ్చే ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. దీనివల్ల ప్రజలకు ప్రాణాపాయ పరిస్థితి కూడా ఏర్పడే అవకాశం ఉందని గుర్తుచేశారు. రోజు వందలాది మంది పెద్దలు, పిల్లలు పార్కును సందర్శిస్తూ సేద తీర్చుకోవడం, పిల్లలు ఆడుకోవడం జరుగుతుందన్నారు. కానీ ఈ పార్కు సమస్యలకు నిలయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత మున్సిపల్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన కాటన్ పార్కులో నెలకొన్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని, పార్కుకు వాచ్మెన్, స్వీపర్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు నోముల కొండ, బూడిద జోగేశ్వరరావు, పొగాకు నారాయణరావు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిని అందజేస్తున్న సిపిఎం నాయకులు

టైలర్స్ సంఘం అభివృద్ధికి భవిష్యత్తులోనూ సహకరిస్తా

మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు 26వ వార్డులో ఎంపీ నిధులు రూ.15 లక్షలతో నిర్మించిన శ్రీక్షీరా రామలింగేశ్వర అసోసియేషన్ నూతన భవనంను మంత్రి నిమ్మల రామానాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడారు. మారుతున్న ఫ్యాషన్ కాలంలో టైలర్లు అందమైన డ్రెస్‌లు కుట్టడం వల్ల మనిషి మరింత అందంగా కనిపిస్తున్నారని చెప్పారు. రెడీమేడ్ రావడంతో టైలర్ల ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉందని చెప్పారు. అందుకే మరో విడత బిల్డింగ్‌కు ఆర్థిక సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. మాజీ ఎంఎల్‌ఎ అల్లు వెంకట సత్యనారాయణ, మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు, ఉన్నమట్ల కబర్ధి, సంఘ నేతలు పాల్గొన్నారు.

టైలర్స్ సంఘ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి

ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

ప్రజాశక్తి - నరసాపురం

ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నరసాపురం పట్టణంలో చురుగ్గా సాగిందని నరసాపురం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య అన్నారు. శనివారం స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్లను పంపిణీ చేశారు. శ్రీహరిపేట, పొన్నపల్లి, కొండలమ్మ గుడి, ఎన్‌టిఆర్ కాలనీ, వీవర్స్ కాలనీ తదితర వార్డుల్లో ఇంటింటికి వెళ్లి పెన్షన్ అందజేశారు. వారి కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మంచినీటి సమస్య, డ్రైనేజీ సమస్య, వీధి లైటింగ్ సమస్య, మున్సిపాలిటీ నుంచి ఏవిధమైన సమస్య ఉన్నా తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెన్షన్ గుమస్తా ఆకుల సాయి, సత్యనారాయణ పాల్గొన్నారు.

మొగల్తూరు : మండలంలోని గ్రామాల్లో ఉన్న సంక్షేమ పింఛన్ లబ్ధిదారులకు ఒకరోజు ముందుగా శనివారం 90.96 శాతం మందికి తమ సిబ్బంది అందించారని ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాణి తెలిపారు. 10,412 మంది లబ్ధిదారులకు గాను 9,471 మందికి అందించామన్నారు. మిగిలిన వారికి సోమ, మంగళవారాల్లో నూరు శాతం పూర్తి చేస్తామని ఎంపిడిఒ తెలిపారు.

ఉండి: మండల వ్యాప్తంగా శనివారం ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ సుమారు 91 శాతం మందికి పంపిణీ చేయడం జరిగిందని ఎంపిడిఒ సివిఎస్.రెడ్డి అన్నారు. పెన్షన్ అందని ప్రతి ఒక్కరూ సోమవారం తమ సిబ్బందికి అందుబాటులో ఉండాలని ఆయన కోరారు.

కాళ్ల : ఒకరోజు ముందే శనివారం పింఛన్‌దారులకు పంపిణీ చేపట్టామని ఏపి డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్‌ఎ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. మండలంలోని పెదఅమిరం గ్రామంలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ నాగరాణితో కలిసి నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి వృద్ధులను ప్రతినెల పింఛన్ పంపిణీ ఎలా జరుగుతుందని అడిగి తెలుసుకున్నారు. అనంతరం 62 డ్వాక్రా గ్రూపులకు స్త్రీనిధి, ఉన్నతిబ్యాంకు లింకేజీ, సిఐఎఫ్ పథకాల ద్వారా మంజూరైన రూ.7.75 కోట్ల చెక్కును మహిళలకు అందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి డొక్కు సోమేశ్వరరావు, ఉప సర్పంచి జవ్వాది కిషోర్, ఎంపిపి పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు, కఠారి నరసింహారాజు పాల్గొన్నారు.

రిలయన్స్ స్మార్ట్ షాపింగ్ మాల్ ప్రారంభం

ఆకివీడు : రిలయన్స్ స్మార్ట్ షాపింగ్ మాల్ ప్రారంభంతో ఆకివీడు స్థాయి మరింత పెరిగిందని ఎపిఐఐసి ఛైర్మన్, మాజీ ఎంఎల్‌ఎ మంతెన రామరాజు అన్నారు. అయిభీమవరంకు చెందిన నాగేశ్వరరావు భవనంలో ఈ షాపింగ్ మాల్ శనివారం ప్రారంభమైంది. దీంతో ఆకివీడులో భారీ హడావిడి కనిపించింది. ఊరంతా రిలయన్స్ సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు కనుమూరు అబ్బాయి రాజు, రిలయన్స్ సౌత్ ఇండియన్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పాల్గొన్నారు.

లోసరి పంట కాలువను ప్రక్షాళన చేయాలి

న్యాయవాది బోకూరి విజయ్ కుమార్

భీమవరం టౌన్ : మండలంలోని లోసరి ప్రధాన పంట కాలువ భీమవరం పట్టణం మీదుగా ప్రవహించడం ద్వారా భీమవరం పట్టణం పొడవునా చెత్తతో నిండి ఉన్న ఈ ప్రధాన పంట కాలువను యండగండి సెక్షన్, జలవనరుల శాఖ అధికారులు ప్రక్షాళన చేయాలని శనివారం న్యాయవాది బోకూరి విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. లోసరి కాలువ పూడిక తీయటానికి ఫ్లడ్ గ్రాంట్ ఉందని, అయినా తూతూమంత్రంగా పనులు చేస్తున్నారన్నారు. ఈ విషయంపై సంబంధిత మానవవనరులు, అధికారులు చర్యలు తీసుకోవడం లేదని వాపోయారు. లోతట్టు గ్రామాలకు ప్రధాన మంచి నీటి పంట కాలువను నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఈ కాలువ ద్వారా గొల్లవానితిప్ప, గూట్లపాడు, కొత్తపూసలమర్రు, దొంగపిండి, తోకతిప్ప, బర్రెవాని పేట, లోసరి తదితర గ్రామాలు, సుమారు 25 వేల మంది ప్రజల జీవితాలు ఆధారపడి ఉన్నాయని, వెంటనే కాలువలు వచ్చే లోపు భీమవరం పట్టణ పరిధిలో ఉన్న చెత్త, పూడిక తీత, యుద్ధ ప్రాతిపదికన పనులు చేయించాలని, లోతట్టు గ్రామాల ప్రజలకు మంచి నీరు అందించాలని కోరారు.

ఎంఎల్‌ఎ అంజిబాబు దంపతులకు శుభాకాంక్షలు

భీమవరం టౌన్ : రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, భీమవరం ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు), సత్యవాణి దంపతుల పెళ్లిరోజు సందర్భంగా శనివారం వారి నివాసంలో పట్టణ ప్రముఖులు, కూటమి నేతలు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆదర్శ దంపతులు చిరకాలం ఆరోగ్యంగా, సంతోషంగా జీవించాలని కోరుకుంటున్నామని శాలువ కప్పి సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, జెడ్‌పిటిసి గుండా జయప్రకాష్, భీమాల శ్రీరామ్మూర్తి, వబిలిశెట్టి రామకృష్ణ, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు పులఖండం కోటేశ్వరరావు, రెడ్డి సత్తిబాబు, కొప్పినిడి శ్రీనివాస్, ముచ్చకర్ల శివ, ముచ్చకర్ల సుబ్బారావు, చల్లా రాము పాల్గొన్నారు.

6న గ్రామ రెవెన్యూ సహాయకుల రాష్ట్ర మహాసభ

భీమవరం : ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల రాష్ట్ర 4వ మహాసభలు గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో ఈనెల 6వ తేదీన జరుగుతున్నాయని గ్రామ రెవెన్యూ సహాయకుల జిల్లా నాయకులు పిల్లి సుబ్బారావు, రావూరి మాణిక్యాలరావు తెలిపారు. భీమవరంలోని సిఐటియు కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఏర్పాటు చేయడానికి, గ్రామ సేవకులను ఐక్యం చేయడానికి సిఐటియు నాయకులు నర్రా రాఘవరెడ్డి నాయకత్వంలో పెద్ద ఎత్తున కృషి జరిగిందన్నారు. సంఘం ఏర్పాటు తర్వాత మండల స్థాయి నుంచి పోరాటాలు చేసి అనేక ఫలితాలు సాధించామన్నారు. ఫలితంగా వెట్టిచాకిరిపోయి కార్యాలయల వద్ద ప్రభుత్వ సేవలలో కొనసాగుతున్నామన్నారు. అర్హత కలిగిన విఆర్‌ఎలను విఆర్‌ఒలుగా ఉద్యోగోన్నతి పొందడానికి జిఒలు సాధించామని, విఆర్‌ఎల పనికి గుర్తింపు రావడానికి సంఘం ఎంతో కృషి చేసిందన్నారు. నైట్ వాచ్మెన్, అటెండర్ పోస్టులలో విఆర్‌ఎలకు అవకాశం కల్పించి ప్రమోషన్లు ఇవ్వాలని, వేతనాలు పెంచాలని, నామినీలను విఆర్‌ఎలుగా గుర్తించాలని గత ఏడేళ్లుగా పోరాడుతున్నప్పటికీ పాలకులు పట్టించుకోవట్లేదన్నారు. సమస్యలు పరిష్కారం అయ్యేవరకు సిఐటియు జెండా నీడ కింద పోరాడతామన్నారు. ఈ సమావేశంలో ఎం.ఆంజనేయులు, నరసింహారావు పాల్గొన్నారు.

వీరవాసరం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం 3వ రాష్ట్ర కౌన్సిల్ మహాసభను జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు యాళ్ల మోహన్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 6న విజయవాడలో నిర్వహించే ఈ సమావేశంలో 14 ప్రధాన డిమాండ్స్‌పై చర్చించి ప్రభుత్వానికి వినతి పత్రం అందజేయడం జరుగుతుందన్నారు. ఉద్యోగుల సమస్యలపై స్పందించే ఏకైన సంఘం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మాత్రమేనన్నారు. ఈ సభకు జిల్లాలో ఉన్న అన్ని శాఖల ఉద్యోగులు పాల్గొనాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పెద్ద ఎత్తున తరలివచ్చి మన ఐక్యతను చాటాలన్నారు.

మా సేవలు గుర్తించండి : ఛైర్‌పర్సన్

ఆకివీడు : పత్రికలు, సమాచార వేదికలు ప్రజాసమస్యలను తమ దృష్టికి తీసుకురావడం ఆనందంగా ఉందని, అయితే ఆ సమస్యలకు తాము స్పందించి చేసిన పరిష్కారాన్ని కూడా వారు గుర్తించాలని నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ హైమావతి కోరారు. పట్టణంలో ఉన్న మంచినీటి సమస్యను పత్రికలు ప్రచురించడం ద్వారా తమ దృష్టికి తీసుకు రావడం ఆనందంగానే ఉందన్నారు. అయితే ఆ సమస్యను తాము పరిష్కరించిన విషయాన్ని కూడా ప్రచురిస్తే ఆనందిస్తామన్నారు. శనివారం నగర పంచాయతీ పాలకవర్గ సమావేశం ఛైర్‌పర్సన్ హైమావతి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో నేరెళ్ల ప్రసన్న మాట్లాడుతూ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న పదో వార్డు ఎక్కువ భాగం జాతీయ రహదారి ఆనుకుని ఉందని, ఆ కారణంగా అధికారులు మరింత శ్రద్ధ తీసుకోవాలని కోరారు. దొర గారి చెరువు గట్టు ట్రాక్‌పై నడకకు లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో పాలకవర్గ వైస్ ఛైర్మన్ పుప్పాల సత్యనారాయణ(పండు), సభ్యులు గేదెల అప్పారావు మాట్లాడారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ నిధుల వినియోగానికి ప్రభుత్వం విధించిన నిబంధనల గురించి కార్యాలయ, మున్సిపాలిటీ నిర్వహణకు 70 శాతం నిధులు వినియోగించాలని, నిర్మాణాలకు రోడ్లు, డ్రెయిన్లు వంటి వాటికోసం 25 శాతం మించకుండా వినియోగించాలని, ప్రభుత్వం నిబంధన విధించిందని తెలిపారు.

సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

కాళ్ల : ముఖ్యమంత్రి సహాయనిధి రోగుల పాలిట పెన్నిధని ఎపి అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్‌ఎ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. పెదఅమిరంలోని ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో వివిధ అనారోగ్య కారణాలతో బాధపడుతున్న 17 మందికి వైద్య ఖర్చుల నిమిత్తం 13వ విడత ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.12 లక్షల విలువైన సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను శనివారం లబ్ధిదారులకు అందించారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మేలైన రకాలతో అధిక దిగుబడులు : జెసి

ఉండి: రైతులందరూ సార్వ పంటలో నూతన, మేలైన రకాలను ఎంపిక చేసుకుని అధిక దిగుబడులు పొందాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని పాందువ్వ గ్రామంలో నిర్వహించిన వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జెసి, జిల్లా వ్యవసాయాధికారి జెడ్ వెంకటేశ్వరరావు పాల్గొని రైతులతో ముఖాముఖి మాట్లాడారు. గ్రామ సర్పంచి సాగిరాజు యామిని ప్రియాంక, ఎడిలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఉపాధి బకాయిలు విడుదల చేయాలి

వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు

పెంటపాడు : ఉపాధి బకాయిలు విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు అన్నారు. మండలంలోని రావిపాడు, చింతపల్లి గ్రామాల్లో ఆయన శనివారం పర్యటించి ఉపాధి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఏప్రిల్ నుంచి చేసిన ఉపాధి కూలీల వేతన బకాయిలు కోసం ఆవేదన వ్యక్తం చేస్తూ మాట్లాడుతున్నారని ఆయన తెలిపారు. వేతన బకాయిలు తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రపంచ కోటీశ్వరులకు లక్షల కోట్ల రాయితీలిస్తున్న ప్రభుత్వం ఉపాధి కూలీలకు మాత్రం పనిచేసిన డబ్బులు ఇవ్వడానికి చేతులు రావడం లేదని ఆయన అన్నారు. తక్షణమే ఉపాధి బకాయిలు విడుదల చేయాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఇంటి గంగరాజు, డాకే దానయ్య, దొడ్డి రామకృష్ణ, జంగం విజయలక్ష్మి, రోడ్డ వెంకటేశ్వర్లు, ఎల్లమెల్లి శ్రీను, సీతారాముడు పాల్గొన్నారు.

వైద్యురాలు కనకప్రియకు వీడ్కోలు

పెనుమంట్ర : గడచిన ఏడాదిన్నర కాలంగా మండలకేంద్రం పెనుమంట్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలిగా సేవలు అందించిన డాక్టర్ పెనుమాక కనక ప్రియ తమ ఉద్యోగానికి శనివారం రాజీనామా చేశారు. ఆస్ట్రేలియాలో ఉద్యోగం వచ్చిన సందర్భంగా ఆమె అక్కడ ఉద్యోగానికి రాజీనామా చేసినట్టు తెలిపారు. ఇప్పటి వరకు తన ఉద్యోగంలో సహకరించిన అధికారులకు, ప్రజా ప్రతినిధులకు, ప్రజలకు, సిబ్బందికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆమెకు స్థానిక పిహెచ్‌సి సిబ్బంది ఏసురాణి, వెంకటరమణ, ఎంపిహెచ్.మల్లేశ్వరరావు, ఎల్‌టి.సత్యనారాయణ మూర్తి, స్టాఫ్ నర్సులు, రేవతి, ముకేశ్, ఉదయ్, మోహనకృష్ణ, శ్రీనివాస, ఇందు, స్వాతి కుమారి, ఎఎన్‌ఎంలు ధనలక్ష్మి, లక్ష్మీ, ఆశ సేవకులు ఘనంగా సన్మానించి మెమెంటో అందించి వీడ్కోలు పలికారు.

పూర్ణ చైతన్య సేవలు ఎనలేనివి

సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ

మొగల్తూరు : మొగల్తూరు పంచాయతీ జూనియర్ అసిస్టెంట్‌గా అనిశెట్టి పూర్ణ చైతన్య ఎనలేని సేవలు అందించారని సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ అన్నారు. మొగల్తూరు పంచాయతీ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్‌గా అనిశెట్టి పూర్ణ చైతన్య ఉద్యోగోన్నతిపై తూర్పు తాళ్ల పంచాయతీ కార్యదర్శిగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మొగల్తూరు పంచాయతీ కార్యాలయంలో శనివారం చైతన్యను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. చైతన్య పంచాయతీ కార్యదర్శిగా ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని సూచించారు. ఇఒపిఆర్‌డి మేడిది నవీన్ కిరణ్, పంచాయతీ కార్యదర్శి ముచ్చర్ల నాగేశ్వరరావు, వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, సిబ్బంది ఉన్నారు.

క్రీడల పట్ల ఆసక్తి పెంపునకు సమ్మర్ క్యాంప్

ముగింపు కార్యక్రమంలో జిల్లా క్రీడాధికారి రాజేష్

తాడేపల్లిగూడెం: నేటి పోటీ ప్రపంచంలో పిల్లలు క్రీడల పట్ల ఆసక్తి పెంచేందుకు జిల్లా స్పోర్ట్స్ సమ్మర్ క్యాంపు నిర్వహించామని జిల్లా క్రీడాధికారి రాజేష్ పేర్కొన్నారు. స్థానిక కోడె వెంకట్రావు మున్సిపల్ హైస్కూల్లో మే మూడో తేదీన ప్రారంభమైన బాస్కెట్‌బాల్ క్యాంపు ముగింపు కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు డాక్టర్ నార్ని బావాజీ మాట్లాడుతూ పిల్లల్లో క్రీడల పట్ల ఎంతో ఆసక్తి రగిలించే విధంగా క్యాంప్ కన్వీనర్ చింతకాయల సత్యనారాయణ అందించిన సేవలు మరువలేనివన్నారు. అలాంటి శిక్షకులు మన తాడేపల్లిగూడెం పట్టణంలో ఉండడం ఈ ప్రాంత క్రీడాకారుల అదృష్టం అన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు చింతకాయల సత్యనారాయణ మాట్లాడుతూ ఎంతో ఆసక్తిగా పిల్లలు ముందుకు వస్తే తాను ఏ సమయంలోనైనా క్రీడలు నేర్పించేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు పి.బ్రహ్మం, విశ్రాంత ఎంఇఒ రామరాజు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో వృత్తి నైపుణ్య శిక్షణ

ఆకివీడు : తమ కళాశాలలో వృత్తి నైపుణ్య శిక్షణ సంస్థ ద్వారా త్వరలో మరో రెండు వృత్తి శిక్షణా కోర్సులలో శిక్షణ ప్రారంభిస్తున్నట్లు దుంపగడప వివి గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రణాళిక అభివృద్ధి కమిటీ కార్యదర్శి డాక్టర్ పివి.ప్రతాప్ కుమార్ తెలిపారు. శనివారం ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సముద్ర ఉత్పత్తుల, చేప, రొయ్య ఎగుమతుల తయారీ, ప్రాసెసింగ్, సెల్ఫోన్ మరమ్మతులలో శిక్షణను ఇస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ శిక్షణ మూడు నెలల కాలం పాటు ఉంటుందని, ఎనిమిదో తరగతి ఆపైన ఉన్నవారు అర్హులని తెలిపారు. కళాశాల నైపుణ్య శిక్షణ సంస్థ సమన్వయకర్త ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి 30 మందికి ఒక్కొక్క బ్యాచ్‌గా మూడు నెలల పాటు శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి గలవారు పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలని చెప్పారు.

కొనసాగిన వేసవి శిక్షణ తరగతులు

తాడేపల్లిగూడెం: వేసవి శిక్షణా తరగతులలో భాగంగా శనివారం పట్టణ ప్రథమ శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు రిసోర్స్‌పర్సన్ ప్రత్తి వీరాస్వామి విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్ వంటి పలు అంశాలపై బోధించారు. కొప్పెల్ల శ్రీనివాస్ విద్యార్థులకు నీతి కథలు చెప్పి పుస్తక పఠనం వల్ల ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పిల్లలను గ్రంథాలయానికి పంపించవలసిందిగా ఆయన కోరారు.

నరసాపురం : ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు కొనసాగుతున్నాయి. శనివారం పిల్లల చేత పుస్తక పఠనం, చదవడం మాకిష్టం కార్యక్రమం, వారి చేత కథలు చెప్పించడం, పుస్తక సమీక్ష నిర్వహించారు. డాక్టర్ అమ్మాజీ, సుధీర్ మోహన్, సత్యనారాయణ, ఆత్మూరి రమ పాల్గొన్నారు.

పెనుమంట్ర: మండలంలోని మార్టేరు శాఖా గ్రంథాలయంలో శనివారం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా 32వ రోజు రామకృష్ణ సేవా సమితిలో చిర్ల సూర్ల నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో పిల్లలకు విజ్ఞాన కార్యక్రమం నిర్వహించారు. రిటైర్డ్ టీచర్ పి.సువర్ణ గౌరి, లైబ్రరీ అధికారి శివకుమార్ పిల్లలకు స్పోకెన్ ఇంగ్లీష్, స్టోరీ టెల్లింగ్, యోగా చేయించారు. కె.దీక్షిత, లక్ష్మి ప్రసన్న, వై. నిహాల్, డి.హేమనందిని, ఎం.సౌజన్య పాల్గొన్నారు.

పలుచోట్ల ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం

కాళ్ల : ప్రజలు పొగ పీల్చకుండా జాగ్రత్తలు తీసుకుని సమాజాన్ని రక్షించాలని వైద్యాధికారి డాక్టర్ సరాబు సునీల్ కోరారు. కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ సరాబు సునీల్ ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం ర్యాలీ శనివారం నిర్వహించారు. ప్రజల్లో అవగాహన పెంచడానికి ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ సునీల్ మాట్లాడుతూ పొగాకు, నికోటిన్ ఉత్పత్తులు తయారు చేసే పరిశ్రమల గురించి అవగాహన కల్పించారు. పొగాకు, నికోటిన్ ఉత్పత్తులను ప్రజలు తీసుకోవడం వల్ల ఊపిరితిత్తుల కేన్సర్, టిబి వచ్చే ప్రమాదం ఉందని, పొగాకు ఉత్పత్తులు తీసుకోవడం వల్ల బిపి, ఇతర వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. పొగ పీల్చే వారి కన్నా పక్కనున్న వారికి కూడా చాలా ప్రమాదం ఉందన్నారు. ఈ సమావేశంలో వైద్యాధికారులు డాక్టర్ డి.సునీత, డాక్టర్ టి.భావన, సిహెచ్ఒ.విజయవతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గణపవరం : పొగ తాగటం వల్ల గుండె జబ్బులు వస్తాయని గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు కె.ఓంకార్‌నాథ్, పి.కరుణ అన్నారు. ప్రపంచ పొగాకు దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక ఆరోగ్య కేంద్ర సిబ్బందితో ప్రతిజ్ఞ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి జాలాది విల్సన్ బాబు, పిహెచ్‌ఎన్ సిహెచ్.సత్యవతి, హెచ్‌వి.పద్మజ, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, ఎఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్‌లు, ఆశాలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పిఎంపి అసోసియేషన్ ఆధ్వర్యంలో పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ కాళిపాడులో శనివారం నిర్వహించారు. పిఎంపి అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎటిర్.పరమేశ్వర్లు మాట్లాడారు. ఈ ర్యాలీలో కాళిపాడు సిహెచ్ఒ ఎ.రమ్యశ్రీ, ఎఎన్‌ఎం.శివకుమారి, పిఎంపి సభ్యులు ఎం.శ్రీనివాస్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

భీమవరం టౌన్ : పొగాకు దూరంగా ఉండాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రజా ఆరోగ్య శాఖ అధికారులు పిలుపునిచ్చారు. శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ధనలక్ష్మి, డాక్టర్ ప్రవీణ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గోవింద బాబు, డాక్టర్ రాంబాబు, డాక్టర్ నీలాగా లక్ష్మి, డాక్టర్ దివ్య, డాక్టర్ ఎన్‌వివి.ప్రసాద్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉండి: పొగాకు వాడకాన్ని నిషేధించాలని ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బి.సాయి చంద్ర, డాక్టర్ పి.లక్ష్మీ సునంద ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాసోత్సవాలను నిర్వహించి, పొగాకు వాటి ఉత్పత్తుల వాడకం వల్ల కలిగే దుష్పరిణామాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

ప్రతిభావంతులను ప్రోత్సహించాలి

23 మంది విద్యార్థులకు స్కాలర్ షిప్స్, సైకిల్ అందజేసిన ఎంఎల్‌ఎ అంజిబాబు

భీమవరం టౌన్: పేదలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వాలు చేస్తున్న కృషికి తోడుగా స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందించడం అభినందనీయమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, భీమవరం ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. శనివారం శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఎంఎల్‌ఎ అంజిబాబు పెళ్లిరోజు సందర్భంగా దాతల సహకారంతో 22 మందికి స్కాలర్‌షిప్స్, ఒక విద్యార్థికి సైకిల్‌ను ఎంఎల్‌ఎ అంజిబాబు చేతులమీదుగా అందించి మాట్లాడారు. ప్రతిభను, ప్రతిభావంతులను ప్రోత్సహించాలని, విద్యార్థులను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని అన్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఏవిద్యార్థి కూడా విద్యకు దూరం కాకూడదని, తమ దృష్టికి వస్తే వారి ఉన్నత చదువులకు సహకరిస్తామని అన్నారు. విద్యతోనే దేశ ప్రగతి అని, దాతలందిస్తున్న సహకారాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పట్టణంలోని ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్ విద్యార్థులు 22 మందికి(ఒక్కొక్కరికి రూ.3 వేలు చొప్పున) రూ.66 వేలు, ఒక విద్యార్థికి సైకిల్‌ను భీమవరం వన్ టౌన్ సిఐ నాగరాజు సహకారంతో అందించామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, భీమాల శ్రీరామ్మూర్తి, వబిలిశెట్టి రామకృష్ణ, ఛాంబర్ అఫ్ కామర్స్ అధ్యక్షులు పులఖండం కోటేశ్వరరావు, భట్టిప్రోలు శ్రీనివాసరావు, చల్లా రాము, కొప్పినిడి బాబీ, యాసా అనిల్, పోకల కిషోర్ పాల్గొన్నారు.

ఘనంగా సూపర్ స్టార్ కృష్ణ జయంతి

భీమవరం టౌన్: వెండితెర నట శిఖరం, తెలుగు సినీ సింహాసనానికి శాశ్వత రారాజు సూపర్ స్టార్ కృష్ణ అని టౌన్ వైడ్ కృష్ణ ఫ్యాన్స్ అధ్యక్షులు వరప్రసాద్ అన్నారు. శనివారం సూపర్ స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా భీమవరం మల్టీప్లెక్స్ పక్కన కృష్ణ, మహేష్ బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ టౌన్ వైడ్ ప్రెసిడెంట్ బోణం వరప్రసాద్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అయన మాట్లాడుతూ తెలుగు చిత్ర పరిశ్రమలో అందరికి గుర్తుండిపోయే పేరు సూపర్ స్టార్ కృష్ణ అని, రకారకాల పాత్రలతో అలరించి ప్రేక్షకుల మదిలో చెరగని ముద్ర వేసుకున్నారని, ఆయన భౌతికంగా లేకపోయినా ఆయన జ్ఞాపకాలు ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. అనంతరం 680 మంది పేదవారికి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కృష్ణ అభిమానులు వంకల బోస్ యాదవ్, హరికుమార్, మీసాల శ్రీనివాస్, ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు పాల్గొన్నారు.

పాలకొల్లు : సాహసాలకు మారుపేరుగా సూపర్ స్టార్ కృష్ణ నిలిచారని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. సూపర్ స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా పాలకొల్లు మారుతి థియేటర్ వద్ద అభిమానులు కేక్ కట్ చేసి పేదలకు దుప్పట్లు, టవళ్లు పంపిణీ చేశారు. 70 ఎంఎం సినిమా తీయాలన్న, సినిమా స్కోప్ సినిమా తీయాలన్న కృష్ణకే సాధ్యమని నిరూపించారని చెప్పారు. ఆయన సేవాభావంతో ఉండేవారని ఆయన అభిమానులు భావితరాలకు స్ఫూర్తిగా నిలిచారని మంత్రి చెప్పారు. మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, సూపర్ స్టార్ కృష్ణ అభిమాన సంఘం నేతలు పాల్గొన్నారు.

రేషన్ వాహనాలు కొనసాగించాలి : సిపిఎం

ప్రజాశక్తి - తణుకు

ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉన్న రేషన్ వాహనాలు కొనసాగించాలని, ఆస్థి పన్నులు పెంపుదలపై సర్వేలు ఆపాలని సిపిఎం పట్టణ కమిటీ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన ధర్నా జరిగింది. రేషన్ వాహనాలు కొనసాగాలని, రేషన్ షాపుల ద్వారా కూడా నిత్యవసరాలు అందించాలని, ఆస్థి పన్ను పెంపుదల ఉపసంహరించుకోవాలని, ప్రజలపై భారాలు ఆపాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో పివి.ప్రతాప్, బళ్ల చినవీరభద్రం, గార రంగారావు, గుబ్బల గోపి, రాజా, సత్యనారాయణ, నాగరత్నం పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పునరుద్ధరణకు ఎన్‌టిఆర్ కృషి

ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ

ప్రజాశక్తి - ఆచంట

టిడిపి స్థాపించే ముందు రాజకీయాలు పెత్తందారుల చేతుల్లో ఉండేవని, టిడిపి స్థాపనతో ప్రజాస్వామ్య పునరుద్ధరణకు ఎన్‌టిఆర్ కృషిచేశారని ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ అన్నారు. ఆచంట రామేశ్వర స్వామి సత్రంలో శనివారం టిడిపి మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా డిసిఎంఎస్ ఛైర్మన్, ఆప్కా ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు ముఖ్యఅతిథిలుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పితాని సత్యనారాయణ మాట్లాడుతూ టిడిపిని ఆవిష్కరించిన తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి తీసుకు వచ్చిన ఘనత అన్న ఎన్‌టి రామారావుకే దక్కుతుందని, ఆయన సేవలు కొనియాడారు. పార్టీకి పనిచేసిన వ్యక్తులను పార్టీ ఎప్పుడూ గుర్తిస్తుందని, కష్టపడిన వారికి పదవులు దక్కుతాయని కుడుపూడి సత్తి బాబుకు శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్, జిల్లా టిడిపి అధ్యక్షులుగా పనిచేసిన గన్ని వీరాంజనేయులుకు ఉమ్మడి జిల్లా కోపరేటివ్ బ్యాంకు ఛైర్మన్, రాష్ట్రంలో ఆప్కా ఛైర్మన్‌గా ఎంపిక కావడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా ఇరువురిని సాలువ కప్పి ఘనంగా సన్మానించి సత్కరించారు.

టిడిపి మండల అధ్యక్షులుగా చిలుకూరి సీతారాం

టిడిపి మండల అధ్యక్షుడిగా చిలుకూరి సీతారాంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆచంట టౌన్ అధ్యక్షునిగా తమ్మినీడి పృథ్వీ కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఇరువురిని పితాని సత్యనారాయణ అభినందించారు. గ్రామాల్లో ఎన్నికైన గ్రామ అధ్యక్ష కార్యదర్శులను సత్కరించారు. అధ్యక్షులుగా పార్టీకి సేవలందించిన కేత వీరయ్యను అభినందించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు, ఎంపిపి దిగుమర్తి సూర్యకుమారి, పార్టీ మండల అధ్యక్షులు కేత మీరయ్య, వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ తమ్మినీడి రామకృష్ణ ప్రసాద్, జక్కంశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

కలకలం.. కలవరం..!

ఉమ్మడి జిల్లాలో వరుస పరిణామాలు రెండు జిల్లావాసులను కలవర పరుస్తున్నాయి. థియేటర్లలో అధికారుల తనిఖీలు కలకలం సృష్టించగా, ఏజెన్సీలో మరోసారి పోలవరం నిర్వాసితుల కోసం భూసేకరణ చేపట్టడం సాగులో ఉన్న గిరిజనుల్లోనూ, కరోనా కేసులు పెరుగుతుండటం జిల్లావాసుల్లో కలవరం సృష్టిస్తున్నాయి.

పవన్ కల్యాణ్ సినిమా విడుదల నేపథ్యంలో థియేటర్ల బంద్ వ్యవహారం చిలికిచిలికి గాలివానలా మారి థియేటర్లలో తనిఖీలకు దారితీసింది. ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశాలతో అన్ని థియేటర్లలో అధికారులు తనిఖీలు నిర్వహించారు. జనం చాలాకాలంగా ఇబ్బంది పడుతున్నట్లుగానే తినుబండారాల ధరలు అధికంగా ఉండటం, మరుగుదొడ్ల వంటి సౌకర్యాలు సక్రమంగా లేకపోవడం వంటి విషయాలను అధికారులు గుర్తించారు. ఉన్నతాధికారులకు నివేదించారు. ఆయా థియేటర్ల యాజమాన్యాలకు హెచ్చరికలు జారీ చేశారు. అయితే థియేటర్ల నిర్వహణలో ఈ దాడులు ఎంతవరకూ మార్పు తీసుకొస్తాయనేది సందేహాస్పదమే. ఎందుకంటే దాడులు జరిగాక కూడా అత్యధిక థియేటర్లలో తినుబండారాల ధరల్లో ఏమాత్రం మార్పు కానరాని పరిస్థితి ఉంది. ఇక మరుగుదొడ్ల మాత్రం కొంత మెరుగుపడ్డాయని చెప్పొచ్చు. అయితే ఈ పరిస్థితి ఎన్ని రోజులు కొనసాగుతుందనేది అనుమానమే. కారణం ఏదైనా థియేటర్లలో పరిస్థితులు మెరుగుపడి ప్రజలకు నిజంగానే వినోదం లభించే పరిస్థితి ఉంటే కచ్చితంగా పాలకులను ప్రశంసించాల్సిందే. లేనిపక్షంలో జనం మరోసారి పాలకుల ఆటలో మోసపోయారని చెప్పక తప్పదు.

ఇక ఏజెన్సీలోని బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో అల్లూరి జిల్లాలోని పోలవరం నిర్వాసితుల కోసం సుమారు 500 ఎకరాలు సేకరించనున్నట్లు అధికారులు ప్రకటించి, పరిశీలన ప్రారంభించారు. దీనిపై సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ వివాదాల్లో లేని భూములనే సేకరిస్తామని చెబుతున్నారు. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం చాలా గ్రామాల్లో ఇప్పటికే గిరిజనుల సాగులో ఉన్న భూములను సేకరించడానికి అధికారులు కసరత్తు చేస్తుండటం సర్వత్రా ఆందోళన నెలకొంది. దీనివల్ల సాగులో ఉన్న గిరిజనులకు, ఆర్‌అండ్‌ఆర్ కింద పట్టాలిచ్చిన గిరిజనులకు మధ్య ఘర్షణలు తలెత్తే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో స్పష్టంగా పరిశీలించడంతోపాటు మండల, గ్రామస్థాయిలో అభ్యంతరాలను స్వీకరించి గిరిజనుల సాగులో లేని, వివాదాలు లేని భూములను సేకరించడం అత్యంత ఉత్తమం. తద్వారా అటు నిర్వాసితులకు, ఇటు సాగులో ఉన్న గిరిజనులకు న్యాయం జరుగుతుంది. లేనిపక్షంలో ప్రభుత్వమే గిరిజనుల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నంగా అంతా పరిగణిస్తారనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

ఇక కరోనా కేసులు అందరినీ కలవర పరుస్తున్నాయి. ఇప్పటికే పది వరకూ కేసులు నమోదైనట్లు వార్తలు వచ్చినా అధికారికంగా ఆరు కేసులను మాత్రమే గుర్తించినట్లు వైద్యఆరోగ్య శాఖాధికారులు ప్రకటించారు. జిల్లా కలెక్టరేట్‌లోని నలుగురు ఉద్యోగులకు ఒకేసారి కరోనా రావడం అందరినీ కలవరపరుస్తోంది. అయితే ఆస్పత్రుల్లో కరోనా వార్డులు సిద్ధం చేసిన ప్రభుత్వం ప్రజలను చైతన్యపర్చడంలో మాత్రం వెనుకబడిందనే చెప్పొచ్చు. ఇప్పటికీ కరోనా లక్షణాలు కన్పిస్తే నిర్ధారణా పరీక్షల కోసం జిల్లా కేంద్రాల్లోని ఆస్పత్రులను లేదా ప్రయివేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. తక్షణం జిల్లాలోని అన్ని పిహెచ్‌సిల్లో కరోనా నిర్ధారణా పరీక్షలు చేపట్టడంతోపాటు మందులు అందుబాటులో ఉంచడం, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రచారం చేయడం వంటి చర్యలు చేపట్టాలి. తద్వారా ప్రజల్లో నెలకొన్న ఆందోళనను తగ్గించేందుకు అవసరమైన అన్ని చర్యలూ చేపట్టాలి.

- వివిఎస్‌వి.ప్రసాద్

నేటి నుంచి రేషన్ షాపుల వద్దే సరుకుల పంపిణీ

ఆచంట : ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ సరుకులను జూన్ 1వ తేదీ నుంచి మండలంలోని రేషన్ షాపుల ద్వారా పంపిణీ జరుగుతుందని తహశీల్దార్ జి.కనకరాజు శనివారం విలేకరులకు తెలిపారు. కార్డుదారులకు రేషన్ సరుకులను అందించేందుకు ప్రతి నెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ షాపులు తెరిచి ఉంచుతారని తెలిపారు. ప్రతిరోజు గ్రామీణ ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం నాలుగు గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ షాపు తెరిచి ఉంటాయన్నారు. వికలాంగులు, వృద్ధులకు, అనారోగ్యంగా ఉన్న వారికి ఇంటి వద్దకే రేషన్ డీలర్లు సరుకులు అందజేస్తారని ఆయన తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పెనుమంట్ర : ఈనెల 1వ తేదీ ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆచంట అసెంబ్లీ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో రేషన్ డిస్ట్రిబ్యూషన్ షాపులను మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ ప్రారంభిస్తారని టిడిపి మండల అధ్యక్షులు కె.శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈమేరకు మండలంలోని బ్రాహ్మణ చెరువు వంతెన వద్ద రేషన్ డిస్ట్రిబ్యూషన్ షాపును ఉదయం 9 గంటలకు, పెనుగొండ మండలంలోని పెనుగొండ బర్రెమ్మ గుడివద్ద షాపును ఉదయం 9.3కు ఆయన ప్రారంభిస్తారన్నారు. ఆచంట మండలంలోని కాపుల పాలెం వద్ద షాపును ఉదయం 10.15కు, పోడూరు మండలంలోని పోడూరు గ్రామంలో కాపుల రామాలయం వద్ద రేషన్ డిస్ట్రిబ్యూషన్ షాప్ ఉదయం 10.45కు ఎంఎల్‌ఎ ప్రారంభిస్తారన్నారు. టిడిపి కూటమి నేతలందరూ హాజరు కావాలని కోరారు.

తహశీల్దార్ కార్యాలయం సందర్శన

తాడేపల్లిగూడెం : జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి శనివారం తాడేపల్లిగూడెం తహశీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. ఈనెల 21వ తేదీన జరగనున్న అంతర్జాతీయ యోగా కార్యక్రమంలో భాగంగా మండలంలో రిజిస్ట్రేషన్ల నమోదు శాతం తక్కువ కావడంపై స్థానిక ఎంపిడిఒను కారణాలు అడిగి తెలుసుకున్నారు. రానున్న రెండు రోజుల్లో రిజిస్ట్రేషన్ శాతం పెంచి యోగ చేయడం వల్ల కలిగే ఆరోగ్య సూత్రాలను ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈనెల 21వ తేదీన జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజున ఎక్కువ శాతం ప్రజలు పాల్గొనేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ ఖతీబ్ కౌసర్‌బనో, తహశీల్దార్ ఎం.సునీల్ కుమార్, ఎంపిడిఒ పాల్గొన్నారు.

విద్యార్థికి సైకిల్ అందజేత

పాలకొల్లు : అడవిపాలెంకి చెందిన విద్యార్థిని కాంతం దుర్గ భవానికి యునైటెడ్ కాపు సర్వీస్ క్లబ్ సభ్యుల సహకారంతో సైకిల్ అందించారు. క్లబ్ గవర్నర్ పెనుమాక రామ్మోహనరావు చేతుల మీదుగా రూ.7 వేల విలువ గల సైకిల్ శనివారం బహూకరించారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్ష కార్యదర్శులు జక్కంపూడి మదన్, వేరుకొండ దుర్గాప్రసాద్, పోకల రాము, రావూరి అప్పారావు, కానూరి ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రత్యేక రైలు ఆగస్టు వరకూ పొడిగింపు

నరసాపురం: నరసాపురం నుంచి అలహాంక, అరిసెకెరె జంక్షన్ వరకు నడుస్తున్న ప్రత్యేక రైలును ఆగస్టు నెలాఖరు వరకు పొడిగిస్తూ దక్షిణ మధ్య రైల్వే ఉత్తర్వులు జారీ చేసినట్లు స్టేషన్ మేనేజర్ మధుబాబు తెలిపారు. 07201 నెంబర్‌తో నరసాపురంలో ఈ రైలు ప్రతి ఆదివారం మధ్యాహ్నం 2.20కు బయలుదేరుతుంది. బెంగళూరుకు సమీపంలోని అలహాంక స్టేషన్‌కు ఉదయం 9 గంటలకు చేరుతుంది. అక్కడ నుంచి బయలుదేరి అరిసెకెరెకు మధ్యాహ్నం 12.45కి వెళుతుంది. తిరిగి అదే రోజు అంటే ప్రతి సోమవారం 07202 నెంబర్‌తో మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12 గంటలకు నరసాపురం చేరుకుంటుందన్నారు. ఈ రైలు జిల్లాలో పాలకొల్లు, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు స్టేషన్లలో ఆగుతుందన్నారు. గుంటూరు, వినుకొండ, నంద్యాల, హిందూపుర్ మీదుగా అరిసెకెరె జంక్షన్‌కు వెళుతుందన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పెనుగొండ : ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ మహిళ మృతిచెందిందని పెనుగొండ ఎస్ఐ గంగాధర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మే 24వ తేదీన మండలంలోని కొటాల్పర్రు గ్రామంలో రోడ్డు పక్కన ఆర్ అండ్ బి రహదారి ఉన్న కోళ్ల ఫారం వద్ద పాసింజర్ ఆటో వెళుతుండగా ఎదురుగా వస్తున్న లోడ్ ఆటో ఢీకొండంతో ఒక మహిళ తీవ్ర గాయాలపాలైంది. పెనుగొండకు చెందిన సిరికా ధనలక్ష్మి(56) తీవ్ర గాయాలు అవ్వడంతో మెరుగైన వైద్యం కోసం రాజమండ్రి ప్రయివేట్ హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. ఇంటిదగ్గర నుంచి మార్టేరు వెళుతుండగా మార్గ మధ్యలో ఈ సంఘటన జరిగింది. ఆమెకు భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. దీనిపై పెనుగొండ ఎస్ఐ గంగాధర్ కేసు నమోదు చేశామని తెలిపారు.

కాలవలోకి దూసుకెళ్లిన కారు

తల్లి, కుమారుడికి గాయాలు

పాలకోడేరు : భీమవరం తాడేపల్లిగూడెం ప్రధాన రహదారిలో గొల్లలకోడేరు వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లి, కుమారుడుకు గాయలయ్యాయి. స్థానికుల కథనం మేరకు దైవ దర్శనానికి వెళ్లిన తల్లి కుమారుడు ద్విచక్రవాహనంపై భీమవరం వైపు వెళ్తుండగా గొల్లలకోడేరు వద్ద రోడ్డుపై అడ్డుగా ఉన్న కారును తప్పించే ప్రయత్నంలో వాహనం అదుపు తప్పి పడిపోయింది. దీంతో వెనుకవైపు కూర్చున మహిళ రోడుపై పడిపోవడంతో అటు నుంచి వస్తున్న కారు మహిళలను తప్పించబోయి పక్కనే ఉన్న మురుగుకోడులోకి దూసుకెళ్లి బోల్తా పడింది. కారులో ఉన్న డ్రైవర్‌ను స్థానికులు డోరు తెరచి బయటకు తీశారు. ఈ ఘటనలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న తల్లి, కుమారుడుకు గాయాలు కావడంతో 108 వాహనంలో భీమవరంలోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు రావలసి ఉందని పాలకోడేరు రైటర్ నాగరాజు తెలిపారు.